సాక్షి ఒడిశా

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,60,435
బంగారం	1 గ్రాము
వెండి	33 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



సరస్వతీ దేవి జన్మ దినోత్సవం పురస్కరించుకుని వసంత పంచమిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

- 8లో



కటక్ సమీపంలో బస్సు బోల్తా

కటక్ నగరం సమీపంలో బుధవారం సాయంత్రం ఒక ప్రైవేట్ బస్సు బోల్తాపడి ప్రమాదానికి గురయ్యింది.

- 8లో

వీడిన ఉత్కంఠ..!

- రాజ్యసభ ఎన్నికలో మూడో అభ్యర్థి ఖరారు
- మరోసారి బీజేపీకి బీజేడీ మద్దతు
- నేడు నామినేషన్ దాఖలు చేయనున్న అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిపై ఊహాగానాలకు తెరపడింది. బీజేడీ, బీజేపీ తాజా ప్రకటనతో ఈ ఉత్కంఠ వీడింది. రాష్ట్రంలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ పేరును భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. ఈ ప్రకటన జారీ అయిన స్వల్ప వ్యవధిలో బిజూ జనతా దళ్ అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్రం నుంచి మూడో అభ్యర్థిగా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. దీంతో మొదటి నుంచి కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు తావిచ్చినట్లు అయ్యింది. ఈ నెల 27న రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. రాష్ట్ర బృహత్తర ప్రయోజనాల కోసం బీజేడీ పార్టీ అశ్విని వైష్ణవ్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర రైల్వేలు మరియు టెలికాం అభివృద్ధి కోసం కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అభ్యర్థిత్వానికి బిజూ జనతాదళ్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేయడం విశేషం.

పొత్తు బలోపేతం

భారత పార్లమెంట్ ఎగువ సభలో బీజేపీతో బీజేడీ పొత్తు క్రమంగా బలపడుతోంది. 2019లో బిజూ జనతా దళ్ మద్దతుతో అశ్విని వైష్ణవ్ ఒడిశా నుంచి ఎగువ సభకు సునాయాసంగా ఎన్నికయ్యారు. తదుపరి రైల్వే, టెలికాం మంత్రిగా అశ్విని వైష్ణవ్ నియమితులయ్యారు. వెంబడి జరుగుతున్న తాజా ఎన్నికల్లో ఎగువ సభకు ఆయనకు వరుసగా రెండోసారి మద్దతు ఇచ్చేందుకు రాష్ట్రంలో అధికార పక్షం సిద్ధమవ్వడం విశేషం.

పూర్తి బలం ఉన్నా...

రాష్ట్రం నుంచి ఎగువ సభలో 3 స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటి భర్తీ కోసం తాజా ఎన్నిక జరగనుంది. ఈ మూడు స్థానాల్లో ఏకగ్రీవంగా బీజేడీ అభ్యర్థులు గెలుపొందే బలం ఉంది. సొంత అభ్యర్థులను బరిలోకి దింపి ఎగువ సభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం పుష్కలంగా ఉన్నా.. రాష్ట్రంలో ప్రధాన విపక్షంగా చలామణి అవుతున్న బీజేపీ అభ్యర్థి అశ్విని వైష్ణవ్‌కు అండగా నిలవడంలో ఆంతర్యం చర్చనీయాంశమైంది. రాష్ట్ర శాసనసభలో విపక్ష బీజేపీ బలం 22 మంది ఎమ్మెల్యేలకు పరిమితం. ఈ బలంతో రాజ్యసభకు ఎన్నిక కావడం అసాధ్యం.

సార్వత్రిక ఎన్నికలకు వ్యూహం

ఈ పరిణామం అతి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పొత్తుకు పరోక్షంగా సంకేతాలు జారీ చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ఈ రెండు పార్టీలు లోపాయికారీ కూటమితో అభ్యర్థులను బరిలోకి దింపి ప్రత్యర్థి కాంగ్రెస్‌ను అధోగతి పాలు చేయడమే ధ్యేయంగా స్పష్టమవుతోంది.

గాంధర్వ బంధం

రాష్ట్రంలో బీజేడీ, బీజేపీ మధ్య గాంధర్వ వివాహ బంధం నెలకొందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ అజయ్ కుమార్ ఇదివరకే వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి ఈ రెండు పార్టీలు వ్యూహాత్మక భారీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయి. బీజేడీ ఎల్లవేళలా బీజేపీకి బహిరంగంగా మద్దతునిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో భారీ కుంభకోణాలకు పాల్పడుతున్నా అందుకే సీబీఐ, ఈడీ దాడుల జాడే లేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, అతని సన్నిహితుడు వి.కె.పాండియన్‌పై సీబీఐ, ఈడీ దాడి చేయకపోవడానికి లోపాయికారి పొత్తే కారణమన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అశ్విని వైష్ణవ్‌కు అభినందనలు

రాజ్యసభకు అశ్విని వైష్ణవ్ అభ్యర్థిత్వం ఖరారు కావడంతో బీజేపీ రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా స్థానిక రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌తో రాష్ట్ర ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖ కార్యకర్తలు ఈ సభకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. బీజేడీతో పొత్తుని ఆశించి బీజేపీ అభ్యర్థిగా అశ్విని వైష్ణవ్‌ని బరిలోకి దింపలేదని మన్మోహన్ సామల్ ప్రకటించారు.

నామినేషన్ నేడు

రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అశ్విని వైష్ణవ్ గురువారం ఉదయం నామినేషను దస్తావేజులు దాఖలు చేయనున్నారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఆయన బరిలోకి దిగనున్నారు. ఇప్పటికే బీజేడీకి చెందిన చెందిన దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియా నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.



రాష్ట్రంలో ఇటీవల జరిగిన బహిరంగ సభలో పీఎం మోదీ, సీఎం నవీన్‌ల ఆత్మీయ కరచాలనం(ఫైల్)



అశ్విని వైష్ణవ్‌కు అభినందనలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

పేకాట శిబిరంపై దాడి



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధి శంకరడ పంచాయతీ కార్యాలయం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టికిరి పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేయగా, శిబిరం నుంచి రూ.9,150లు నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ సలోమ్ కాటేజ్‌లో హైటెక్ మెడికల్ (భువనేశ్వర్) కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హైటెక్ మెడికల్ కళాశాలల ఎండీ రూపేష్ పాణిగ్రాహి విచ్చేసి పలు రోగాలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. దాదాపు 2,420 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో దిప్పు పట్నాయిక్, అజయ్ బొడోనాయక్, ప్రవీణ్ కుమార్ లిమ్మా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర కల్యాణ మండపంలో డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంస్థలు సంయుక్తంగా రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించాయి. పుల్వామా దాడిలో అమరులైన జవానులకు నివాళులర్పిస్తూ శిబిరాన్ని నిర్వహించామని ఫౌండేషన్ అధ్యక్షుడు బి.రాజేష్ తెలియజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ గౌతం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



కిషోర్, సునీత రాణి దంపతులు(ఫైల్)

భువనేశ్వర్: భర్త చనిపోవడంతో భార్య తలకొరివి పెట్టిన ఘటన కటక్ మఛువా బజార్ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మఛువా బజార్ ప్రాంతానికి చెందిన కిషోర్ కుమార్ భగత్(66), సునీత రాణి(57)కి సంతానం లేదు. వీరు ఆర్జించిన ఆస్తి కోసం సోదరుల మధ్య నిత్యం గొడవ జరిగేది. దీంతో మరో చోటికి వెళ్లి భార్యతో కలిసి జీవనం సాగించేవాడు. కిషోర్ కుమార్ వ్యాపారవేత్త, అతని భార్య లెక్చరర్. ఇటీవల కిషోర్ కుమార్ అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఈ స్థితిలో ఆయన కన్నుమూశారు. దహన సంస్కారాల కోసం కటక్‌లోని ఖాన్‌నగర్ శ్మశానవాటికకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు వచ్చి గొడవపడ్డారు. అంత్యక్రియలకు అతని బంధువులు ఎవరూ ముందుకు రాలేదు. చివరికి ఆయన భార్య సునీత భర్తకు తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. అయినప్పటికీ కుటుంబ సభ్యులు తనను బెదిరించారని మృతుడి భార్య సునీత బోరుమంది. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు, చికిత్స సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ సహకరించలేదని వాపోయింది. చివరికి అంత్యక్రియల సమయంలో కూడా ఇరుగుపొరుగు వారు సాయపడి ఆదుకున్నారని తెలియజేసింది.

సంక్షేమ పథకాలే విజయానికి పునాదులు

- బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి



ప్రసంగిస్తున్న నెక్కంటి భాస్కరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాయగడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ పథకాలే బీజేడీ విజయానికి పునాదులని బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జేకేపూర్‌కు సమీపంలోని అమలాహట్టలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సుస్థిర పాలన అందించడంతో పాటు సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి దోహదపడతాయన్నారు. పేద, బడుగు, వెనుకబడినవారికి ఆశాదీపంగా మారిన బీజేడీ పార్టీ త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించడం ఖాయమన్నారు. అయితే కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్, రాయగడ శాసనసభలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానాన్ని కూడా కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

మార్చి 15 వరకు ప్రచార కార్యక్రమాలు

మార్చి 15వ తేదీ వరకు పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నెక్కంటి వెల్లడించారు. ప్రతీ పంచాయతీలో సమావేశాలను నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాల కోసం చైతన్యపరిచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో చేసిన తప్పిదాలను మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజాదరణ ఉన్నంత వరకు రాష్ట్రంలో బీజేడీకి ఎటువంటి ఢోకా లేదని కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక అన్నారు. పార్టీ విజయానికి పట్టు కొమ్మలైన కార్యకర్తలు ఈసారి వ్యూహాత్మకంగా పని చేయాల్సి ఉంటుందని సూచించారు. సమావేశంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, ఉపాధ్యక్షులు హరప్రసాద్ హెప్రుక, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, బీజేడీ యువ నాయకులు బినాయక్ కర్, దూడల శ్రీనివాస్‌రావు, సుజాత పాలో తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజలు

అంతన్నారు.. ఇంతన్నారు..!



మల్కన్‌గిరి జిల్లా గౌడిగూడ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఎయిర్ పోర్టును ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడ విమానాలు తిరిగితే భువనేశ్వర్ వరకు ప్రయాణించవచ్చని కలలుగన్న స్థానికులకు నిరాశ ఎదురవుతోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో అదరాబాదరాగా ఎయిర్ పోర్టు ప్రారంభించారు. కానీ పనులు మాత్రం పూర్తవ్వలేదు. దీంతో ఇంకా ఈ ఎయిర్ పోర్టు నుంచి ప్రయాణాలు ప్రారంభమవ్వలేదు. ఫలితంగా రన్ వే పరిసరాల్లో పశువులు సంచరిస్తుండడంతో స్థానికులు నివ్వెరపోతున్నారు. – మల్కన్‌గిరి

డ్యాంప్స్‌కు స్కాచ్ అవార్డు



స్కాచ్ అవార్డుతో విపత్తు నిర్వహణ అధికారులు

భువనేశ్వర్: డిజాస్టర్ అసిస్టెన్స్ మానిటరింగ్ అండ్ పేమెంట్ సిస్టమ్ (డ్యాంప్స్)ని సమర్థవంతంగా అమలు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డు సొంతం చేసుకుంది. విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల తదుపరి బంధువులకు త్వరితగతిన ఎక్స్‌గ్రేషియా చెల్లింపు ప్రక్రియని డ్యాంప్స్ సులభతరం చేస్తుంది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ వ్యవస్థని రూపొందించి అభివృద్ధి చేసింది. విపత్తు బాధితుల బంధువులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు రంగంలో డ్యాంప్స్ ఆన్‌లైన్ పర్యవేక్షణతో పనిచేసే డిజిటల్ ప్లాట్‌ఫారమ్. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత్ సాహు తరఫున అదనపు ప్రధాన సహాయ కమిషనర్ పద్మనాభ్ బెహరా, డిప్యూటీ కార్యదర్శి బిశ్వనాథ్ సాహు అవార్డును అందుకున్నారు. మీడియా ప్రతినిధులతో బిస్వనాథ్ సాహు మాట్లాడుతూ డ్యాంప్స్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అత్యంత ఆకాంక్షాత్మక ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్వహణలో అనుబంధ వాటాదారుల పాత్ర అత్యంత కీలకంగా పేర్కొన్నారు. 2020 జూన్ 10న డ్యాంప్స్ ప్రవేశపెట్టామన్నారు. విపత్తు పరిహారం బాధితులకు చెల్లించే సమస్యాత్మక అడ్డంకులను ఈ వ్యవస్థ తొలగించిందని వెల్లడించారు. ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని సకాలంలో విడుదల చేయడమే కాకుండా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు మరియు తహసీల్దార్లపై అదనపు పని భారం నుంచి ఉపశమనం పొందడంలో డ్యాంప్స్ వేదిక సహాయపడుతుందని వెల్లడించారు.

రాయగడలో కాంగ్రెస్ నిరసన

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నిరసన చేపట్టారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, ఆయన సతీమణి పూజా ఉలక, పీసీసీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు రత్నమణి ఉలక, పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సీనియర్ నాయకుడు అప్పల స్వామి కద్రక తదితరులు పాల్గొన్న ఈ నిరసన ర్యాలీలో బీజేడీ, బీజేపీ పార్టీలకు వ్యతిరేక నినాదాలు చేపట్టారు. రెండు పార్టీలు ప్రజలను దోచుకుంటున్న విధానాన్ని ప్రజలకు వివరించారు.



నిరసన ర్యాలీలో నృత్యం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం నవీన్ సుడిగాలి పర్యటన



బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



సీతలపల్లికి చేరుకున్న సీఎం నవీన్ పట్నాయక్

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గంజాం జిల్లాలో బుధవారం సుడిగాలి పర్యటన సాగించారు. ఉదయం 10.20 గంటల సమయంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్ నుంచి బిజూ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలీప్యాడ్‌లో గంజాం జిల్లా బరంపురం నగరానికి సమీపంలోని పర్లా మహారాజ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానానికి చేరుకున్నారు. అక్కడ సీతలపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన సోమో ఆస్పత్రిని ప్రారంభించారు. అనంతర సరగడాలో ఐటీఐ కొత్త భవనం, ఆదర్శ విద్యాలయ కొత్త హాస్టల్ భవనం, స్కిల్ డవలప్‌మెంట్ భవనం, నందిని కాలువ, కొత్త పంచాయతీ భవనం, ఆధునిక వీధి లైట్లు, రూశికుల్యా నది కొత్త బ్రిడ్జిలను ప్రారంభించారు. వీటితో పాటు చలిగడా, గటకేశ్వరి, హరబంగి తాగు, సాగు నీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం హింజిలికాట్ జంక్షన్‌లోని దివంగత ముఖ్యమంత్రి బిజూ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం హింజిలికాట్‌లో ఆర్ఎంసీ భవనం ప్రారంభించారు. గ్రిడ్–కో సబ్‌స్టేషన్, గొండలా నది సింగిపూర్ దగ్గర కొత్త బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. గర్భిణీ మహిళలకు మమత యోజన పథకం కింద రూ.5 వేలు నుంచి రూ.10 వేలుకి పెంచారు. అనంతరం తిరిగి హెలీప్యాడ్‌లో సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ బయల్దేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి విక్రమ్ కేసరి అరుకు, మహిళా సంక్షేమ మంత్రి ఉషాదేవి, అస్కా ఎంపీ ప్రమిళ బిసాయి, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, 5–టీ కార్యదర్శి కార్తికేయ పాండియన్ తదితరులు పాల్గొన్నారు.



సరగడలో ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



సభలో పాల్గొన్న జన సందోహం

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రింగ్ రోడ్డు వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి ఉదయం ఆహ్వాన పూజలు, సుందరాకాండ, రామాయణ పారాయణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.శంకర్ రెడ్డి, కార్యదర్శి దిలీప్ కుమార్‌లు తెలియజేశారు. వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం అన్నదానం కార్యక్రమం జరుగుతుందని కమిటీ తెలియజేసింది.

సీపీఐ పాదయాత్ర ప్రారంభం


పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జాన్‌బాయి పంచాయతీ గురుప్రియ వంతెన నుంచి రాష్ట్ర సీపీఐ కార్యదర్శి ఆలీ కిషోర్ పట్నాయక్ పాదయాత్ర మంగళవారం ప్రారంభించారు. ఈ పాదయాత్ర చిత్రకొండ, ఖోయిర్‌పూట్, మత్తిలి సమితుల మీదుగా ఈనెల 20వ తేదీ వరకు 170 కిలోమీటర్లు సాగుతుందని తెలియజేశారు. పాదయాత్రలో తెలుసుకున్న ప్రజల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద సభ నిర్వహిస్తామని జిల్లా సీపీఐ ప్రెసిడెంట్ బ్రోజామాఝి వెల్లడించారు. పాదయాత్రలో సీపీఐ సభ్యులు రంగానాథ్ హంతాళ్, బాలరాం గోలారి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


మధ్యమికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ మిశ్రో

మల్కన్‌గిరి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మాజీ ఎమ్మెల్యే మనాస్ మడ్కమి అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి మల్కన్‌గిరి కళాశాల 43వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానని తెలియజేశారు. గిరిజనులకు విద్యనందించాలనే ఉద్దేశంతో బిజూ పట్నాయిక్ హయాంలో కళాశాల స్థాపించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మందస: బారువ-మందస రైల్వేస్టేషన్ల మధ్య బాలిగాం సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మరణించినట్లు పలాస జీఆర్పీ పోలీసుల తెలిపారు. మృతుడి వయసు 55-60 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్పీ హెచ్‌సీ చక్రధరరావు బుధవారం తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు లభించకపోవడంతో స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఫొటోలను గుర్తించినట్లు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ లిఫ్టు వద్ద వ్యక్తి ఫొటో లభ్యమైందని, వివరాలు తెలిసిన వారు 9618017943 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

వడ్రంగి షాపు దగ్ధం

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి ప్రధాన రహదారిలో వెంటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న తరణి సురేష్, తరణి రమేష్ కార్పెంటర్, వెల్డింగ్ షాపు అగ్నికి ఆహుతైంది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన మిషన్లు, రూ.3 లక్షల విలువైన కలప, వస్తువులు కాలిబూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. పొందూరు అగ్నిమాపకం సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బాధితులను ఓదార్చారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నాగుపాము కలకలం

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు రోటరీనగర్‌లో నాగుపాము కలకలం రేపింది. బుధవారం ఉదయం జనావాసాల్లోకి రావడంతో మహిళలు పరుగులు పెట్టారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే మాయం కావడంతో ఎటు వెళ్లిందోనని ఆందోళన చెందుతున్నారు.

● సందడే సందడి


ధౌళీ శాంతి స్థూప సందర్శనలో హాకీ అధికారిక బృందం


ఏకామ్ర క్షేత్రం వద్ద...


లింగరాజు మందిరం పరిసరాల్లో...

ఎఫ్‌ఐహెచ్ ప్రో లీగ్ కోసం ఒడిశా విచ్చేసిన సాంకేతిక అధికారులు నగర పరిసరాల్లోని పలు ప్రాచీన, వారసత్వ క్షేత్రాల్లో సందడిగా బుధవారం గడిపారు. లింగరాజ్ ఆలయం, ధౌళి శాంతి స్థూపం, ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉన్న పలు ప్రదేశాలను సందర్శించారు. – భువనేశ్వర్

● చచేరి అలంకరణ


శ్రీమందిరంలో జగన్నాథ స్వామివారు చచేరి అలంకరణలో భక్తులు, యాత్రికులకు బుధవారం దర్శనమిచ్చారు. ఏటా వసంత రుతువు శ్రీపంచమి తిథి పురస్కరించుకుని శ్రీమందిరం రత్న వేదికపై దేవతా మూర్తులు చచేరి అలంకరణతో శోభిల్లడం ఆచారం. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. – భువనేశ్వర్

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

● సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు

సరస్వతీ దేవి జన్మదినోత్సవం పురస్కరించుకుని వసంత పంచమిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. అధిక మంది తమ పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ కటాక్షం సిద్ధించాలని మొక్కుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. పలుచోట్ల సరస్వతీదేవి విగ్రహావిష్కరణలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్


రాయగడ: సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం


పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో పూజలు


రాయగడ: వివేకానంద విద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం


బరంపురం: హౌసింగ్ బోర్డు కాలనీలో సరస్వతీ దేవి అవతారంలో గాయత్రీ మాత


బరంపురం: గుసానినువాగంలో పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు


పర్లాకిమిడి: విద్యాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం


బరంపురం: సరస్వతి శిశు విద్యా మందిర్‌లో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కటక్ సమీపంలో బస్సు బోల్తా

● ఒకరు మృతి


బోల్తాపడిన బస్సు వద్ద సహాయక చర్యలు

భువనేశ్వర్: కటక్ నగరం సమీపంలో బుధవారం సాయంత్రం ఒక ప్రైవేట్ బస్సు బోల్తాపడి ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ప్రమాదానికి గురైన బస్సులో సుమారు 40 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. భువనేశ్వర్ నుంచి బాలాసోర్ వెళ్తుండగా 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. కటక్ సమీపంలోని గోపాల్‌పూర్ వద్ద ఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. డ్రైవర్ స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడంతో బస్సు అదుపు తప్పింది. స్థానికులు తక్షణమే సహాయక చర్యల్లో పాలుపంచుకుని బస్సులోని ప్రయాణికులను రక్షించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్థానికుల సాయంతో క్షతగాత్రులను నగరంలోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు ప్రమాదంలో ఒక ప్రయాణికుడు మరణించాడు. స్థానికుల సమాచారం ప్రకారం బస్సుకు ఎదురుగా అకస్మాత్తుగా సైకిల్ రావడంతో సైక్లిస్టును కాపాడే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవర్ చొరవతో సైకిలిస్టును రక్షించినా, బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొని బస్సు బోల్తా పడింది.

కలప దుంగల అక్రమ రవాణా


సీజ్ చేసిన కలప దుంగల లారీ

● ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రాయగడ: లారీలో కలప దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను టికిరి అటవీ శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో ఖుర్ద జిల్లాకు చెందిన రమేష్ ధొళాయి (32), కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితిలోని జిడియాపెండ ప్రాంతానికి చెందిన భగవాన్ బిసాయిలు ఉన్నట్లు టికిరి అటవీ శాఖ రేంజర్ దివ్యమాధురి శెతి తెలియజేశారు. అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలోని కుచేయిపాదొరొ ప్రాంతంలో ఒక లారీ అతివేగంగా వెళ్తుండడం గమనించి దానిని వెంబడించారు. దీంతో లారీని ఆపి తనిఖీ చేయగా కలప దుంగలు బయటపడ్డాయి. అతి విలువైన కలప దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలియజేశారు. ఫారెస్టర్ డొంబురుధర్ సేనాపతి నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. నిందితులపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు


ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికైన ఆర్‌ఎస్‌రావును సత్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలని మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ గంగాధరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో డీఎం ఎ.మల్లికార్జునరాజు అధ్యక్షతన రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ అవతారం, చీఫ్ మెడికల్ అధికారి కింతలి కిరణ్‌కుమార్, ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు మల్లిఖార్జునరాజు, కేఆర్‌ఎస్ శర్మలు మాట్లాడుతూ రహదారి నిబంధనలు వివరించారు.ప్రమాద రహిత రికార్డు కలిగిన ముగ్గురు డ్రైవర్లకు బహుమతులు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రాజు, పి.కృష్ణవేణి, వి.రమేష్, ఎ.గంగరాజు, నాలుగు డిపోల డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, అన్ని అసోసియేషన్‌ల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గైనికాలజిస్టుల సంఘ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం : జిల్లా గైనికాలజిస్టుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు డాక్టర్ ఎస్.శ్రీదేవి, డాక్టర్ ఎం.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జిల్లా ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా డాక్టర్ పూబ రామారావు, గౌరవ అధ్యక్షులుగా దానేటి శ్రీధర్, కార్యదర్శిగా డాక్టర్ బగ్గు సంధ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్లు డి.పార్వతి, పి.రేవతి, ఎస్.శ్రీదేవి, కోశాధికారిగా ప్రశాంతి, సహాయ కార్యదర్శులుగా డాక్టర్లు సందీప్, స్రవంతి, స్వర్ణలత, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఆర్.అరవింద్, ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సంఘం జాతీయస్థాయి ఫెడరేషన్‌కు అనుసంధానించినట్లు తెలిపారు.

పలాసలో మాయం.. రాజస్థాన్‌లో ప్రత్యక్షం

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురంలో మాయమైన ద్విచక్ర వాహనం రాజస్థాన్‌లో ప్రత్యక్షమైన ఘటన చోటుచేసుకుంది. గతేడాది ఏప్రిల్‌లో కిష్టుపురం గ్రామంలో ఆర్.భానుమూర్తి ఇంటి బయట యూనికార్న్ బైక్‌ను పార్కింగ్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో అపహరించుకుపోయారు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పది నెలల అనంతరం బైక్ రాజస్థాన్‌లో ఉందంటూ అక్కడి పోలీసుల నుంచి బాధితుడికి బుధవారం ఫోన్ వచ్చింది. స్థానిక పోలీసుల సాయంతో బైక్ తెచ్చుకునేందుకు రాజస్థాన్ వెళ్లనున్నట్లు భానుమూర్తి తెలిపారు.

వైభవంగా వీరవసంతేశ్వర విగ్రహ ప్రతిష్టాపన

● రూ.2.50 కోట్లతో అయ్యప్ప, ఆంజనేయ, నవగ్రహ మంటపాల నిర్మాణం
● దర్శించుకున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మండలంలోని శ్వేతగిరిపై నూతనంగా నిర్మించిన వీరవసంతేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. రూ. 2.50 కోట్లతో అయ్యప్ప, ఆంజనేయ, నవగ్రహ మంటపాలు సముదాయంలో వేదపండితులు సునరావు చంద్రశేఖర శర్మ, అర్చకులుచే ఈ క్రతువు నిర్వహించారు. ముందుగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్‌శర్మ దంపతులు ఆభరణాలు, యంత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం హైద్రాబాద్‌కు చెందిన యోగేశ్వరశర్మచే అయ్యప్ప పడిపూజ, భజన నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురాం, గుండ భాస్కరరావు, పీస గోపి, యాళ్ల నారాయణమూర్తి, జల్లు గౌరిపతినాయుడు, కొయ్యాన నాగభూషణం, కొంక్యాణ ఆదినారాయణ, జల్లు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లదే ప్రయాణికుల భద్రత


ఆటోవాలాలతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టేలా బాధ్యతగా వాహనాలను నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానాల్లో చేర్చాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆటోడ్రైవర్లకు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ట్రాఫిక్ పోలీసులు, జిల్లా రవాణా అధికారుల ఆధ్వర్యంలో ఆటోవాలాలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ హైవేల్లో సర్వీసు రోడ్లో మాత్రమే ఆటోలు నడపాలని స్పష్టం చేశారు. ప్రమాదం చేసిన వెంటనే మీరు తప్పించుకున్నారనుకున్నా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంటారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ మోహన్, నెహ్రూ యువకేంద్రం ఉజ్వల్‌లు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించగా కె.సి.ఐకేర్ వైద్యుడు పి.ఎల్.రాజు ఆటోడ్రైవర్లకు కంటివైద్య చికిత్సలు చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గంగాధర్, అనిల్‌ల ఆధ్వర్యంలో లైవ్ యాక్సిడెంట్ వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ యర్రగుంట శృతి, ట్రాఫిక్ సీఐ అవతారం, రూరల్ సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సిబ్బంది, ఎన్జీవోలు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' చేసేందుకు సిద్ధం

● నేడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు
● టెక్కలి ఐతమ్ కళాశాల వేదికగా నిర్వహణ
● ఉత్తమ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక


ప్రాజెక్టును నిశితంగా పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యాశాఖ నడుంబిగించింది. 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు రంగం సిద్ధమైంది. టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ (ఐతమ్) కళాశాల వేదికగా జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం ఉదయం 9 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, విద్యాశాఖ సిబ్బంది హాజరుకానున్నారు.

జిల్లా నుంచి 164 ప్రాజెక్టులు ఎంపిక..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలను ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల పురస్కారాలతో ప్రోత్సహిస్తున్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెట్టి ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. ఈ విధంగా 2022-23కుగాను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి 1950 ప్రాజెక్టుల నామినేషన్లు పంపించారు. ఇందులో విషయ పరిజ్ఞానం, సరికొత్త ఆలోచనలతో రూపుదిద్దుకున్న 216 ప్రాజెక్టులను అధికారులు ఎంపికచేశారు. ఇందులో 30 మండలాల(రాజాం, పాలకొండ నియోజకవర్గాల మినహా)తో కూడిన శ్రీకాకుళం జిల్లా నుంచి 164 ప్రాజెక్టులను జిల్లాస్థాయి పోటీలకు అనుమతిస్తున్నారు. ప్రాజెక్టు తయారీ, నిర్వహణ, ప్రదర్శనల కోసం వచ్చేందుకు ప్రాజెక్టుకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటికే ప్రభుత్వం జమచేసింది.

10 శాతం రాష్ట్రపోటీలకు ఎంపిక..

164 ప్రాజెక్టులలో ఉత్తమమైనవి 10 శాతం అనగా 16 ప్రాజెక్టులు రాష్ట్రపోటీలకు ఎంపికచేస్తారు. మరికొన్ని మెరుగైన ప్రాజెక్టులు సైతం రాష్ట్రపోటీలకు ఎంపిక చేసే వెసులుబాటు ఉంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తదుపరి రాష్ట్రపోటీలు చిత్తూరు వేదికగా (తేదీలు ఖరారుకాలేదు) జరగనున్నాయి.


ప్రదర్శనలకు సిద్ధం చేసుకున్న ప్రాజెక్టులతో విద్యార్థులు

క్లుప్తంగా

పైడితల్లి నిత్యన్నదానానికి లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కామేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ అధికారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యై దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి నిత్యన్నదానానికి బొడ్డవలస గ్రామానికి చెందిన కె.కామేశ్వరరావు, ఆయన సతీమణి హైమావతి జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళం బుధవారం అందజేశారు. పైడితల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, సూర్యనారాయణలకు విరాళం అందజేశారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఏడిద రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగికి ఎస్ఈ అభినందన



పైడిరాజును అభినందిస్తున్న ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు

విజయనగరం: జిల్లాస్థాయిలో జరిగిన మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యుత్ ఉద్యోగిని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు బుధవారం అభినందించారు. ఇటీవల జరిగిన పోటీల్లో 50 ప్లస్ విభాగంలో పాల్గొన్న రికార్డ్ అసిస్టెంట్ పి.పైడిరాజు సింగిల్స్‌లో ప్రథమ స్థానం, డబుల్స్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి పి.హరి, కార్యదర్శి వి.మోహన్ బాబు పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి హుండీ చోరీ



దుండగులు విరగ్గొట్టిన హుండీ

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ జంక్షన్ వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలోని హుండీలో గల సొమ్మును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ఆలయం వద్ద గల విద్యుత్ వైర్లు కట్ చేయడంతో ఆప్రాంతమంతా చీకటి అలుముకుంది. అనంతరం గునపం సహాయంతో హుండీని పెకిలించి విరగ్గొట్టి హుండీలో ఉన్న సుమారు రూ. 10 వేలు దోచుకుపోయారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

40 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



సీజ్ చేసిన మద్యం సీసాలతో నిందితుడిని చూపిస్తున్న ఎస్సై గోపాలరావు

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ రోడ్డులో గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు, షాపుల్లో తనిఖీలు నిర్వహించి బి.నాయుడు పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో షాపులో తనిఖీ చేసి 40 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. దీంతో మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడు నాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీరఘట్టం: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వై.వి.నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వీరఘట్టంలో పంచాయతీ వర్కర్లతో సమావేశమయ్యారు. పనిభారం పెరుగుతున్నందున కార్మికులను పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సరస్వతీ నమస్తుభ్యం



అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న వేద పండితులు



తులాభారంలో చిన్నారి



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు వారి తల్లిదండ్రులు



వసంత పంచమి పురస్కరించుకుని స్థానిక రింగురోడ్డులో ఉన్న లక్ష్మీ భువనేశ్వరీ సమేత జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సుమారు నాలుగు వేల మంది చిన్నారులకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ ప్రతీ గంటకు ఒక బ్యాచ్ చొప్పున అక్షరాభ్యాసాలు చేయించారు. శ్రీశారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో వందలాది మంది వలంటీర్లు భక్తులకు తమ సేవలను అందించారు. తల్లిదండ్రులు చిన్నారులతో దిద్దించిన అక్షరాల పలకలను నెత్తిన పెట్టించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. మరికొంతమంది తులాభారం వేయించారు. సుమారు 15వేల మందికి పైగా భక్తులు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చి అక్షరాభ్యాసాలను తమ చిన్నారులకు చేయించుకున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

విజయనగరం అర్బన్: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సంజీవయ్య జయంతి కార్యక్రమం జరిగింది. తొలిత సంజీవయ్య చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులు చదివి వినిపించారు. కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి 14, 1921లో జన్మించిన సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా అతి చిన్న వయసులోనే సేవలందించారని పేర్కొన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య నిరాడంబరతకు మారుపేరుగా నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి అందరికీ ఆదర్శప్రాయులయ్యారని పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ విశ్వేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఏఎస్ శిబిరాల్లో మెరుగైన సేవలు అందించండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఫూల్‌బాగ్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరం నిర్వహించడానికి ముందు సంబంధిత గ్రామం, వార్డుల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచించారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా టెంట్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

బీసీ రిజర్వేషన్ కల్పించాలి

- తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు
- కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష ప్రారంభం

విజయనగరం టౌన్: తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్రా తెలగ సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు చనుమల్ల ప్రసాదరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరాహార దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1915 నుంచి 1966 వరకూ ఉన్న బీసీ రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. శనివారం వరకూ నిరాహారదీక్షలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రాలో తెలగాలు, కోస్తా జిల్లాల్లో పెద కాపులు, రాయలసీమలో బలిజలు, సర్కారు జిల్లాల్లో ఒంటరులు అంతా ఒక్కటే కులమని స్పష్టం చేశారు. వారంతా ఆర్థికంగా వెనుకబడిన వారేనని, తప్పనిసరిగా వారందరికీ రిజర్వేషన్‌లు కావాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు తెలగ సంఘం ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ తెలగ సంఘం నాయకుడు తీగల హరినాథ్, తాడి నానాజీ, మహిళా సంఘం నాయకులు పూనిసెట్టి శాంతి, రమణమ్మ, నందమూరి రమణమూర్తి, రామారావు కూనిసెట్టి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్న చనుమల్ల ప్రసాదరావు, తదితరులు

ఆటో బోల్తా: పలువురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

గరుగుబిల్లి: వివాహ నిశ్చితార్థానికి వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పదిహేను మంది ఆటోలో వంగర మీదుగా జియ్యమ్మవలస మండలంలోని గౌరీపురం గ్రామానికి నిశ్చితార్థం కార్యక్రమానికి వస్తుండగా గరుగుబిల్లి మండలంలోని చిలకాం ప్రధాన రహదారి మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరికి తీవ్రగాయాలు కావడంతో, 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద రహిత రవాణా వ్యవస్థ అందరి బాధ్యత

- ట్రాఫిక్ కమిషనర్ రవీంద్రనాథ్
- ఆర్టీసీలో ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

విజయనగరం అర్బన్: ప్రమాద రహిత రవాణా వ్యవస్థను అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు అందరూ బాధ్యత వహించాలని ట్రాఫిక్ కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు. జిల్లా స్థాయిలో ఆర్టీసీ నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో జరిగిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు నిర్వహించిన వారోత్సవాలను పొడిగిస్తూ ఈ ఏడాది నుంచి మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 2022లో ఆర్టీసీ, సాధారణ రవాణాల్లో జరిగిన 700 ప్రమాద సంఘటనల్లో 250 వరకు మరణాలు సంభవించాయని తెలియజేశారు. అయితే గత ఏడాది 2023లో జరిగిన 650 ప్రమాదాల్లో కేవలం 150 మంది మాత్రమే మరణించారని మరణాల రేటు తగ్గించగలిగామని, అందుకు ఆర్టీసీ డ్రైవర్లను అభినందించాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలను అందిచిన జోన్, డిపోల స్థాయిలోని డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలు 15 మందికి బహుతులు అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్, డిప్యూటీ సీటీఎం కొటాన శ్రీనివాసరావు, డీపో మేనేజర్‌లు జే.శ్రీనివాసరావు, కె.రమేష్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



సత్కారం పొందిన ఉత్తమ డ్రైవర్లు

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో పునర్నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, పిన్నింటి నర్సింగరావు (చిన్న) కలిసి సుమారు రూ.2.50 లక్షలు విలువ చేసే వెండి కిరీటాన్ని అమ్మవారికి బహూకరించారు.

పోలమాంబ నాల్గవ జాతర ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాల్గవ జాతర ఆదాయాన్ని ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, కేశఖండన, లడ్డు, పులిహోర ప్రసాదం, అన్నదాన విరాళం ద్వారా రూ.8,32,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను వచ్చేవారం లెక్కించనున్నట్లు ఈవో సూర్యనారాయణ చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ చేసిన ముద్దాయికి జైలు శిక్ష

మక్కువ: స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, ములక్కాయవలస గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో చోరీకి పాల్పడిన ముద్దాయికి 8 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సాలూరు కోర్టు బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. 2019లో రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో, అప్పటి ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదు చేశారు. మక్కువకు చెందిన చిన్న గొడబ జగదీష్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి, అరెస్టు చేసి వస్తువులను రికవరీ చేసి కేసు ఫైల్ చేశారు. ఈ కేసుపై సాలూరు మెజిస్ట్రేట్ కె.రమేష్ విచారణ జరిపి పై విధంగా తీర్పు వెలువరించారు.

16న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో శ్రీ వీరాంజనేయ తీర్థం సందర్భంగా గౌరీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభవుతాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లుకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు చొప్పున నగదు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 91771 17763 నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు

విజయనగరం టౌన్: వినియోగదారుల హక్కులు, సేవలపై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం బిజినెస్, ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఆడమ్ గొళ్లమూడి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలికమ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన కన్స్యూమర్ అడ్వోకసీ గ్రూప్ మెంబర్స్ పరిశీలకులుగా పాల్గొంటారన్నారు. సమస్యలు, సలహాలు, సూచనలను నేరుగా తెలియజేయాలని కోరారు.

ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగస్వాములే

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగస్వాములేనని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ప్రాంగణంలో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ. 9 లక్షలతో ఆధునీకరించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, ఉద్యోగుల సంపూర్ణ సహకారమే కారణమని ప్రశంసించారు. ఉద్యోగుల సహకారం లేనిదే ఏ కార్యక్రమం ముందుకు వెళ్లదన్నారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, వారి కష్టసుఖాల పట్ల వెన్నంటి నిలుస్తున్నామని చెప్పారు. మినిస్టీరియల్ భవనాన్ని అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్దారని అభినందించారు. భవన నిర్వాహణలో ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు చింతాడ మురళి, కార్యదర్శి వంగపండు రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు కేబీ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి రాత పరీక్ష ద్వారా 5వ తరగతి, 6 నుంచి 9వ తరగతివరకు ఆంగ్లమాధ్యమంలో మిగిలిఉన్న సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనవలస (బాలురు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 5 సీట్లు, 9వ తరగతి 3 సీట్లు ఉన్నాయి. అలాగే కురుపాం (బాలికలు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 1, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో రెండు సీట్లు ఉన్నాయి. భద్రగిరి (బాలురు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 4 సీట్లు, 7వ తరగతి 8, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో 3 సీట్లు ఉన్నాయి. కొమరాడ (బాలురు)లో 5వ తరతి 80 సీట్లు, 6, 7వ తరగతిలో చెరొకటి, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో రెండు సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 21న ఆయాపాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ 9490957218, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ 9490971090 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బైక్, వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

- చికిత్స పొందుతున్న మరో ఇద్దరు యువకులు



మృతిచెందిన కరుణ్ (ఫైల్)



అపస్మారక స్థితిలో దిలీప్



మరో బాధితుడు హరి

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్ర గాయాల పాలై అపస్మాకర స్థితికి చేరుకున్నాడు. ఇంకో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలంలోని మజ్జిరాముడు పేట గ్రామానికి చెందిన బలివాడ కరుణ్, పొట్నూరు దిలీప్, బలివాడ హరిలు ద్విచక్రవాహనంపై మజ్జిరాముడు పేట గ్రామం నుంచి పాలకొండ వెళ్తున్నారు. అదే సమయంలో సంకిలి చక్కెర కర్మాగారానికి గోనె సంచులు తీసుకెళ్లేందుకు వచ్చిన ఐషర్ వ్యాన్ డ్రైవర్ ఫ్యాక్టరీ వద్ద రివర్స్ చేస్తుండడంతో బైక్, వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బలివాడ కరుణ్(17) అక్కడికక్కడే మృతిచెందగా, పొట్నూరు దిలీప్, బలివాడ హరిలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న యువకులను చూసిన మజ్జిరాముడుపేట గ్రామ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు 108 వాహనానికి సమాచారం అందించి, వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి అక్కడి వైద్యులు రిఫర్ చేశారు. చికిత్స అందుతుండగానే దిలీప్ అపస్మారకస్థికి చేరుకున్నాడు.



ప్రమాదస్థలివద్ద రక్తపు మడుగులో యువకులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ

ప్రమాదం జరిగిన స్థలాన్ని బొబ్బిలి ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఇ.శ్రీనివాసరావులు పరిశీలించారు. వ్యాన్ డ్రైవర్ వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, సమీపంలో విచారణ చేయగా ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. బంధువులు ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కోరారు.

16, 17తేదీల్లో జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్ సదస్సు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గిరీష్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఈ నెల 16, 17తేదీల్లో స్టెప్‌కాన్ 16వ జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుని ఆధీనంలో కృత్రిమ మేధస్సు అనే అంశంతో నిర్వహించనున్న ఈ సదస్సును విశాఖపట్నంకు బార్క్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఏటా జరుగుతున్న ఈ స్టెప్‌కాన్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారని చెప్పారు. సమావేశంలో కన్వీనర్ డాక్టర్ టీఎస్ కిశోర్, డాక్టర్ బి.అనిల్‌కుమార్, కేవీఎస్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ప్రవేశాలకు నోటిఫికేషన్

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రభుత్వ సీట్ల కోసం నోటిఫికేషన్ విడుదలైందని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలో గల అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశానికి 25 శాతం ఉచిత సీట్లు కల్పించమని కమిషనరీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రవేశాలకు 'సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' పోర్టల్‌లో నమోదు షెడ్యూల్ విడుదల చేశారు. స్కూళ్లను ఎంపిక చేసుకుని నమోదు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీవరకు అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ద్వారా ప్రవేశానికి విద్యార్థుల అర్హత నిర్ధారణకు మార్చి 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు షెడ్యూల్ ఉందని వివరించారు. సీట్ల ఎంపిక లాటరీ తొలి రౌండ్ ఫలితాలను ఏప్రిల్ 1వ తేదీన ప్రచురిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ తేదీలు ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ మధ్య ఉంటాయన్నారు. రెండవ రౌండ్ లాటరీ ఫలితాల ప్రచురణ ఏప్రిల్ 15 తేదీన ఉంటుందని, విద్యార్థుల తుది ప్రవేశాలు ఏప్రిల్ 16 నుంచి 23వ తేదీల మధ్య ఉంటాయని ప్రకటించినట్లు డీఈఓ తెలిపారు.

రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్టు టీటీడీ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. టీటీడీ ఆవరణలో రథసప్తమి వేడుకల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న శుక్రవారం మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో రఘు మండల జెడ్పీ స్కూల్ లోనూ, మన్యం జిల్లాలో కొమరాడ మండలం లోనూ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, వెంకటపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.